నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 21 : కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే పత్తిని క్రమంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలకు రైతులు తాము పండించిన పత్తి పంటను తరలించే క్రమంలో నిబంధనల మేరకు 8నుంచి 12 శాతం మించకుండా తమ ఇంటి వద్దనే ఆరబెట్టుకొని నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి కనీస మద్దతు ధర రూ. 7,020 పొందాలని ఆయన కోరారు.

30న లోక్ అదాలత్

బెల్లంపల్లి రూరల్, డిసెంబర్ 21: ఈ నెల 30న బెల్లంపల్లి న్యాయస్థానంలో ఏర్పాటు చేయనున్న జాతీయ లోక్ అదాలత్ మేళాను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ గురువారం తెలిపారు. క్షణికావేశంలో చిన్న నేరాలకు పాల్పడి ఇబ్బందులకు గురవుతున్న వారికి, భార్యా భర్తల కేసులు, యాక్సిడెంట్ కేసులు, భూమి తగాదా కేసులతో ఇబ్బంది పడుతున్న వారికి సత్వర పరిష్కారం అందించేందుకు బెల్లంపల్లిలో లోక్ అదాలత్ మేళాను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాజీమార్గం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలనుకునే వారు బెల్లంపల్లి వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్నవారు కూడా జైలుకు వెళ్లకుండా జరిమానా చెల్లించి కేసులు మాఫీ చేసుకునేందుకు లోక్ అదాలత్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కక్షిదారులు ఈ నెల 30 లోపు తమను సంప్రదించాలని కోరారు.

బావిలో పడి ఒకరి మృతి

దండేపల్లి, డిసెంబర్21: దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి పేరాల రామస్వామి(42) గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గంగన్నపేట్‌కు చెందిన రామస్వామి నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప లక్ష్మణ్ వద్ద కొన్ని రోజులు క్రితం వ్యవసాయ పనులు చేసేందుకు వచ్చాడు. పనిచేసే క్రమంలో ఈ నెల 20 సాయంత్రం 4 గంటల నుంచి కనిపించ లేదు. గ్రామస్తులు వెతికినా ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం 11గంటల ప్రాంతంలో చుట్టు పక్కల వారు గమనించగా వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. బావిలో నుంచి తీసిచూడగా రామస్వామి అని గుర్తించారు. రామస్వామి వ్యవసాయ బావి వద్ద చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి మృతిచెందాడని కూతురు గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు పగిలి ఆటో బోల్తా

బోల్తా పడ్డ ఆటో

జన్నారం, డిసెంబర్ 21 : మండల కేంద్రంలోని జింకల శరణాలయం వద్ద ప్రధాన రోడ్డుపై రోటిగూడ నుంచి బడికి పిల్లలను తీసుకు వస్తున్న ఆటో టైరు పగిలి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సలను అందించారు. ఇద్దరు విద్యార్థులు సురక్షితంగా ఉన్నట్లు డాక్టర్ ఉమశ్రీ తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కోటపల్లి, డిసెంబర్ 21 : కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని బొప్పారం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ కళాజాతతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు పథకాలు, రైతులు, విద్యార్థులు, మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలు, బ్యాంక్ ద్వారా అందిస్తున్న ఇన్సురెన్స్ పాలసీలు, ప్రయోజనాలను బ్యాంకు మేనేజర్ ప్రశాంత్ వివరించారు. నగదు రహిత లావాదేవీలపై వివరించి సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు చిరంజీవి, మెజీషియన్ విష్ణు, రైతు సంఘాలు, పొదుపు సంఘాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపానెల్ మెంట్ ఆఫ్ అవుట్‌సోర్సింగ్ కోసం

టెండర్ ప్రక్రియ ప్రారంభం

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, డిసెంబర్ 21 : ఎంపానెల్‌మెంట్ ఆఫ్ అవుట్‌సోర్సింగ్ టెండర్ ప్రక్రియను ప్రారంభించినట్లు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి టెండరు ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెండరు ప్రక్రియలో భాగంగా 52 టెండర్ షెడ్యూల్స్ చేయగా 52 బిడ్ చేశారని తెలిపారు. 2 టెండర్లు ఈఎండీ చెల్లించని కారణంగా రద్దు చేశామని, మిగతా షెడ్యూల్స్ అన్ని సక్రమంగా పరిశీలించి ఎంపానెల్‌లో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లా ఉపాధి కల్పన అధికారి, జిల్లా కోశాధికారి, జిల్లా కార్మిక శాఖ అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకటరమణ, జిల్లా కోశాధికారి రాజేశ్వర్, కార్మిక శాఖ అధికారి వినీత, అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికే సాధికారత హబ్

- హబ్ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య

మాట్లాడుతున్న మహిళా సాధికారత హబ్ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 21: మహిళల అభ్యున్నతికి మహిళా సాధికారత హబ్ కృషి చేస్తుందని హబ్ జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య పేర్కొన్నారు. గురువారం సీసీసీ నస్పూర్ లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం-జూనియర్ కళాశాలలో హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయతో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ సౌజన్య మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలు, మహిళల సంరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. భేటీ బచావో - భేటీ పడావో, లింగ వివక్ష, లింగ సమానత్వం, బాలిక విద్య, బాల్య వివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, సైబర్ క్రైం, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567, తదితర అంశాలపై వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ స్పెషల్ ఆఫీసర్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు

- ఆర్డీవో రాములు

ఆర్డీవోను సన్మానిస్తున్న హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్

హాజీపూర్, డిసెంబర్ 21 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రెవెన్యూ శాఖ ఉద్యోగుల సహకారంతో ప్రశాంతంగా నిర్వహిస్తామని మంచిర్యాల ఆర్డీవో రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ ఆర్డీవోను శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్ఐలు ప్రభు, మంగ, కొండు జనార్దన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌ను ప్రజలే ఎన్నుకునేలా అవకాశం కల్పించాలి

బెల్లంపల్లి, డిసెంబర్ 21: మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ప్రత్యక్షంగా ప్రజలు ఓటు ద్వారా ఎన్నుకునే విధానాన్ని కల్పించాలని కాంగ్రెస్ నాయకులు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకు వినతిపత్రం సమర్పించారు.18వ వార్డును వచ్చే ఎన్నికల్లో జనరల్‌కు కేటాయించాలని కోరారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలి

- లక్ష్మీనగర్ వాసుల వినతి

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీనగర్ వాసులు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 21: మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీనగర్ రోడ్ నంబర్ 5/2లో నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలని కోరుతూ కాలనీ వాసులు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందించారు. అంతకుముందు ఎమ్మెల్యే పీఎస్సార్ నివాసానికి వెళ్లి వినతిపత్రాన్ని అందించారు. లక్ష్మీనగర్‌లో జీ రవీందర్ తన ఇంటిపై సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టగా గతంలో రెండుసార్లు అడ్డుకున్నామని తెలిపారు. మళ్లీ ఇటీవల సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టాడని తెలిపారు. కాలనీవాసుల ఆరోగ్యం దృష్ట్యా వెంటనే ఎన్‌వోసీని రద్దు చేసి టవర్ నిర్మాణాన్ని ఆపేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్ కాలనీ వాసులు కే దత్తాత్రి, గజెల్లి వెంకటయ్య, గోపతి లచ్చన్న, రాజిరెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

- భారత ఉపరాష్ట్రపతిపై వ్యాఖ్యలకు నిరసన
- జిల్లా వ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనం

దండేపల్లిలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తాండూర్, డిసెంబర్ 21 : భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ ని అవమాన పరుస్తూ పార్లమెంట్ ఆవరణలో హాస్య ప్రదర్శన చేసిన వీడియోలు తీసిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ భారత ఉపరాష్ట్రపతి క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. తాండూరు మండల కేంద్రంలో గురువారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ తాండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ రహదారిపై దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి దూడపాక భరత్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి తుకారాం, మండల ఉపాధ్యక్షుడు పుట్ట కుమార్, కోమండ్ల శ్రీనివాస్ నాయకులు ఏముర్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

దండేపల్లిలో..

దండేపల్లి, డిసెంబర్ 21 : ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు దండేపల్లి మండల కేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు బందెల రవిగౌడ్, లక్ష్మీనారాయణ, బోడ నర్సింగ్, దుమ్మని సత్తయ్య, కర్ణాల కిషన్, సీపిరిశెట్టి శ్రీనివాస్, ఎంబడి సురేందర్, రాకేశ్, దివ్య, శకుంతల, భాగ్యలక్ష్మి, దొమ్మాటి వెంకటేశ్, సతీశ్, గురువయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆరట్టు ఉత్సవం

అయ్యప్ప విగ్రహాలను ఊరేగిస్తున్న అయ్యప్ప భక్తులు

జన్నారం, డిసెంబర్ 21 :మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలోని అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలను గురువారం ఉదయం ఊరేగింపుగా బాదంపెల్లి వద్ద గోదావరిలో జలాభిషేకం చేశారు. అనంతరం ఊరేగింపుగా పేటతుళ్లి నృత్యాలతో తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు సామ లింగన్న, కిషన్ రెడ్డి, చంద్రశేఖర్, రమేశ్‌గౌడ్, స్వాములు పాల్గొన్నారు.

వైభవంగా భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

హోమం చేస్తున్న భక్తులు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 21: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లిలో శ్రీభక్తాంజనే స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామంలోని పురాతన భక్తాంజనేయ స్వామి ఆలయాన్ని గ్రామస్తులు పునర్నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా అచ్చలాపూర్‌కు చెందిన దుద్దిళ్ల మనోహర అవధాని బృందం ఆధ్వర్యంలో గురువారం హోమ పూజలు చేశారు. వివిధ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పునర్నిర్మాణం చేసిన ఆలయంలో ఈ నెల 22న విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రతిష్ఠాపనాచార్యులు దుద్దిళ్ల మనోహర అవధాని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొనగోటి రంగారావు, గోపాల్‌రావు, దెబ్బటి నాగయ్య, సిరిపురం రామన్న, కట్కూరి దేవయ్య, దుర్కి మల్లయ్య, కొక్కిరాల సత్యనారాయణరావు, దెబ్బటి రామన్న, ధర్ని శంకర్, బొలిశెట్టి బాపు, అడప పోషం, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేసిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

బెల్లంపల్లి, డిసెంబర్ 21: తిలక్ వాకర్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వారికి అందించారు. చలి తీవ్రత దృష్ట్యా నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రత్నం రాజం, గంగ రాము, కంటెవాడ నగేశ్, గెల్లి జయరాం, లింగాల రాజేశ్, శంకర్‌గౌడ్, మేకల రాజయ్య, నాగుల లింగయ్య, లక్ష్మణ్, రమేశ్ పాల్గొన్నారు.

జాతీయ రహదారికి మరమ్మతులు

రహదారిపై గుంతలు పూడ్చి తారు వేయించిన అధికారులు

బెల్లంపల్లి, డిసెంబర్ 21: పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న గుంతలను పూడ్చుతూ సంబంధిత అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని మూలమలుపు నుంచి కాల్‌టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా ఏర్పడిన గుంతలను పూడ్చుతూ నూతనంగా రోడ్డు వేస్తున్నారు. ఆర్అండ్ బీ, జాతీయ రహదారుల సంస్థ సంయుక్తంగా రోడ్డు పనులు చేపట్టారు. గతంలో గుంతలతో ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. రోడ్డు పనులు చేపట్టడంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్ విశ్వ విద్యాలయ చెస్ పోటీలకు గురుకుల విద్యార్థిని

అరుణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 21 : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్ తృతీయ సంవత్సరం విద్యార్థిని కే అరుణ అంతర్ విశ్వవిద్యాలయ చెస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీ సుమతి గురువారం వెల్లడించారు. కాకతీయ యూనివర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 18న జరిగిన ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీల్లో అరుణ ప్రతిభ కనబర్చి చెన్నైలోని తమిళనాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయ చెస్ పోటీలకు ఎంపికైందన్నారు. అరుణను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ కే శివలీల, పీడీ డాక్టర్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్

బెల్లంపల్లిరూరల్, డిసెంబర్ 21: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మారయ్య ఆధ్వర్యంలో ఈ నెల 20 న జైపూర్‌లో నిర్వహించిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్ జిల్లా స్థాయి పోటీల్లో కాసిపేట సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 14 విభాగంలో 8 వ తరగతి విద్యార్థి కే సంకేత్ జావెలిన్‌త్రో లో గోల్డ్‌మెడల్ సాధించాడు. బీ అనిల్ (8వ తరగతి) ట్రాయత్ లాన్ లాంగ్‌జంప్, 60మీటర్ల పరుగు పందెం, హైజంప్ విభాగాల్లో 1824 పాయింట్లతో గోల్డ్‌మెడల్ సాధించాడు. అండర్ 17 విభాగంలో ఏ అజయ్ (8 వ తరగతి) లాంగ్‌జంప్‌లో బ్రాంజ్‌మెడల్ దక్కించుకున్నాడు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ టీ స్రవంతి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మోహన్, వ్యాయామ ఉపాధ్యాయు లు సల్వాల సంతోష్, కుమ్మరి శ్రీకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

గోల్డ్‌మెడల్ సాధించడం అభినందనీయం


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ అల్ఫీ

హాజీపూర్, డిసెంబర్ 21 : ఈ నెల 20న మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్‌మెడల్ సాధించిన గుడిపేటలోని మౌంట్ కార్మెల్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని ఎస్ దీక్షితను ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ సిస్టర్ అల్ఫీ అభినందించారు. దీక్షితను పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు.

గ్రామపంచాయతీకి భవనాన్ని కేటాయించాలి

తాండూర్, డిసెంబర్ 21 : మండలంలోని మాదారం గ్రామపంచాయతీలోని సీఈఆర్ క్లబ్ ఎదుట నిర్మించిన గదిని గ్రామ పంచాయతీ అవసరాల కోసం కేటాయించాలని జిల్లా పంచాయతీ అధికారికి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ అవసరాల కోసం గదిని నిర్మిస్తున్నామని గతంలో పంచాయతీ కార్యదర్శి చెప్పడం జరిగిందని, ఇప్పుడు ఆ గది తమ సొంతమని సర్పంచ్ భర్త తమతో ఫోన్‌లో చెప్తున్నాడని వార్డు సభ్యులు కుశ్నపల్లి లక్ష్మీనారాయణ, పాముల పద్మ, గొర్లపల్లి భానేశ్, గోదల లక్ష్మి, పాండ్రాల భాగ్య పేర్కొన్నారు.

సింగరేణి

ఆర్కే1ఏ గనికి స్టార్ రేటింగ్ అవార్డు

కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జీఎం

రామకృష్ణాపూర్/ మందమర్రి, డిసెంబర్ 21: మందమర్రి ఏరియా ఆర్కే1ఏ గనికి 2019-20, 2020-22 సంవత్సరానికిగాను స్టార్ రేటింగ్ అవార్డుకు ఎంపికైంది. ఈ స్టార్ రేటింగ్ అవార్డును 9వ రౌండ్ ఆఫ్ కమర్షియల్ కోల్‌మైన్స్ యాక్షన్స్ సందర్భంగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర బొగ్గు గనులు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి నుంచి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్ స్టార్ రేటింగ్ అవార్డును అందుకున్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం : ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, డిసెంబర్ 21 : సింగరేణిలో ఏఐటీయూసీని గెలిపిస్తే గనులు ప్రైవేటీకరణ కాకుండా పోరాటాలతో అడ్డుకుంటామని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గనిపై బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల పోరాటాలతో ఎన్నో హక్కులు సాధించామన్నారు. అలవెన్స్‌లపై ఆదాయపు పన్ను రద్దుకు కృషి చేస్తామన్నారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, 20 లక్షల రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య సెంట్రల్ సెలబస్ అందిస్తామని చెప్పారు. కాంట్రాక్టీకరణ తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా కార్మికులతో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదన్నారు. ప్రభుత్వ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ కార్మికులను మభ్యపెట్టి గెలవాలని చూస్తున్నదని ఆరోపించారు. అధికారమే లక్ష్యంగా కొందరు నాయకులు కండువాలు మార్చి వస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్ల నుంచి 100 మంది ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, నాయకులు గజ్జి రమేశ్, అఫ్రోజ్‌ఖాన్, సదానందం, యాదగిరి, సందీప్, అజయ్, శంకరయ్య పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ చేసిందేమీ లేదు'

శ్రీరాంపూర్, డిసెంబర్ 21 : సింగరేణి కార్మికులకు ఐఎన్‌టీయూసీతోనే హక్కులు సాధించు కోగలుగుతామని ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై ఆయన పాల్గొని మాట్లాడారు. గనులు ప్రైవేటీకరణ బిల్లును సీపీఐ నాయకులు పార్లమెంట్‌లో అడ్డుకోలేదన్నారు. ఇప్పుడు ప్రైవేటీకరణపై మాట్లాడే హక్కు వారికి లేదన్నారు. సింగరేణిలో బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఏఐటీయూసీ తమ యూనియన్‌ను విమర్శించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామన్నారు. రూ.20 లక్షల వడ్డీ లేని గృహ రుణాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణి శ్యాంకుమార్, యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, తిరుపతిరెడ్డి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జి విజయపాల్‌రెడ్డి, కేంద్ర కార్యదర్శి సమ్ము రాజయ్య, రాఘవరెడ్డి, అశోక్, పేరం రమేశ్, నాయకులు సమ్మయ్య, రావుల అనిల్, సమ్మిరెడ్డి, వెంకటస్వామి, సుధాకర్, కాల్వ శ్రీనివాస్, భీమ్ రవి, సతీశ్, శ్రీకాంత్, బుస్స రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కోలిండియా ఒప్పందాల అమలుకు కృషి

శ్రీరాంపూర్, డిసెంబర్ 21 : కోలిండియాలో అమలవుతున్న ఒప్పందాలు సింగరేణిలో అమలుకు బీఎంఎస్ కృషి చేస్తుందని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పులి రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5గనిపై, ఆర్కే 8కాలనీలో డిస్పెన్సరీల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్మికులకు అలవెన్స్‌లపై విధిస్తున్న ఆదాయపు పన్ను రద్దుకు కృషి చేస్తామన్నారు. జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ మార్చి తగిన విధంగా లాభం చేకూరేలా కృషి చేస్తామన్నారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ్వ మహేశ్, ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రవీందర్, జీడీ ప్రభాకర్, శ్రీకాంత్, రాగం రాజేందర్, రమేశ్, శ్రీనివాస్, మేడ వంశీకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన

కుంకుమార్చన చేస్తున్న మహిళలు

శ్రీరాంపూర్, డిసెంబర్ 21 : శ్రీరాంపూర్ ఆర్కే 6 కాలనీలోని గీతా ప్రశాంతి నిలయంలో రజతోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం గీతా సత్సంగ్ భక్తులు మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీ మద్భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు దాసరి రాజేశం, కార్యదర్శి డీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు, ధ్వజారోహణ, మేలుకొలుపు, భగవద్గీత, లలిత, విష్ణు, హనుమాన్ చాలీసా, గురు గీతా, ముకుంద పారాయణం నిర్వహించారు. అనంతరం కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీ కృష్ణుడికి అభిషేకాలు, తులసీ మాత పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ నెల 23న గీతా జయంతి నిర్వహిస్తామని గురువు దాసరి రాజేశం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మద్భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి రాజమౌళి, లక్ష్మీనారాయణ, సభ్యులు మల్లేశ్, సారయ్య, శ్రీనివాస్, రమాదేవి, మాధవి, లక్ష్మి, పద్మ, వినోద, సుశీల, స్వర్ణకుమారి, రాంబాబు, మనోహర్, సమ్మయ్య, పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో

కోటపల్లి, డిసెంబర్ 21 : గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలను అమలు చేస్తూ వెలమపల్లిని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని ఎంపీవో అక్తర్ మొహియుద్దీన్ సూచించారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీవో గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజూ చెత్తను సేకరించి, డంప్ యార్డుకు తరలించాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శి తనుగుల శైలజకు సూచించారు.